
# ఆదిలాబాద్ వార్త



మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

బుధవారం 15, అక్టోబర్ 2025


# కబ్జాదారులకు కల్పతరువు



- ✪ కన్నాల గ్రామపంచాయతీ పరిధిలో గల నెమిల్ల గుట్ట ఏమైంది?
- ✪ 60 సర్వే నంబరు నందు 55 ఎకరాల 18 గుంటల ప్రభుత్వ భూమి ఇందిరమ్మ గృహాలకు కేటాయించాలి
- ✪ రైతు కార్మికుల సంఘాల వేదిక డిమాండ్

బెల్లంపల్లి, అక్టోబర్ 14, ప్రభాతవార్త

మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి మండలంలోని కన్నాల గ్రామ పంచాయతీలో ప్రభుత్వ భూమిని కొంతమంది బడా వ్యాపారస్తులకు, అలాగే ప్రజాప్రతినిధులకు లవని పట్టా చేసి రియల్ ఎస్టేట్ చేసుకొనుటకు అనుమతి ఇచ్చిన అధికారులపై చర్యలు గైకొనాలి. గుట్టలకు పట్టాలిచ్చిన అధికారులను తక్షణమే ఉద్యోగాల నుంచి తొలగించాలి. ప్రభుత్వ,అసైన్డ్, భూములు,అనర్హులకు లవని పట్టాలు, లావని పట్టాల్లో రియల్ ఎస్టేట్ వెంచర్లు, నాలా పర్మిషన్లు, గత ప్రభుత్వంలో అసైన్డ్ కమిటీలే లేవు, లవని పట్టాలు ఎలా ఇచ్చారు. ఎర్రకుంట చెరువుపై సంబంధిత అధికారులు సమగ్ర విచారణ జరిపి యధావిధిగా ఎర్రకుంట చెరువు పనులను యుద్ధ ప్రాతిపాదికన ప్రారంభించాలి. 2లో..



# విద్యార్థుల సంక్షేమంపై దృష్టి సారించాలి

● రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

ఆసిఫాబాద్, అక్టోబర్ 14, ప్రభాతవార్త

రాష్ట్రంలోని బెస్ట్ అవైలబుల్ పాఠశాలలలో విద్య అభ్యసిస్తున్న విద్యార్థుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారించాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక ప్రణాళిక, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క అన్నారు. మంగళవారం హైదరాబాద్ నుండి రాష్ట్ర సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఇతర ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, షెడ్యూల్డ్ కులాలు, ఇతర అధికారులతో మిగతా 2లో..



## ఘన్‌పూర్ చింతల్ బోరీ అడవుల్లో

# పెద్దపులి, చిరుత సంచారం

బోథ్, అక్టోబర్ 14 ప్రభాతవార్త

మండలంలోని ఘన్ పూర్, చింతల్ బోరీ అడవుల్లో పెద్దపులి సంచరిస్తుంది. ఇటీవలె ఘన్ పూర్ మహారాష్ట్ర సరిహద్దుల్లో రెండు ఆవులను హతమార్చన సంగతి తెలిసిందే అయితే సోమవారం ఫారెస్ట్ రేంజ్ అధికారీ ప్రణయ్ వారి సిబ్బంది తో కలిసి పులిజాడ వెతకగా పులి పాదముద్రలు గుర్తించారు అడవిలో అమర్చిన సీసీ కెమెరా పుటేజులు చూడగా పెద్దపులి, చిరుత, ఎలుగుబంటి, నీలుగాయి, తోడేళ్లు, కెమెరాకు చిక్కాయి ఫుటేజీ ఆధారంగా వన్యప్రాణులు మన అడవి ప్రాంతంలో మనుగడ సాగిస్తున్నాయని సూచించారు. దట్టమైన ఘాన్ పూర్, చింతల్ బోరి అటవీ ప్రాంతంలో తిరుగుతుండగా హాలీవుడ్ సినిమాలను తలపించేలా ఉన్న అతిపెద్ద స్పైడర్ సాలె పురుగులు దర్శనమిచ్చాయి. వన్యప్రాణులకు నీటి సౌకర్యం కోసం ఏర్పాటు మిగతా 5లో..





# బాధ్యులను వెంటనే అరెస్ట్ చేయాలి



* మధుకర్ కుటుంబానికి బిజెపి అండగా ఉంటుంది

* తెలంగాణ రాష్ట్ర బిజెపి అధ్యక్షుడు రామచందర్‌రావు

వేమనపల్లి, అక్టోబర్ 14, ప్రభాతవార్త

బిజెపి మంచిర్యాల జిల్లా వేమనపల్లి మండలం బిజెపి అధ్యక్షుడు ఏటా మధుకర్ ఆత్మహత్య పట్ల రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రాంచందర్ రావు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మంగళవారం మధుకర్ కుటుంబాన్ని పరామర్శించి, వారి చిత్రపటానికి నివాళులు అర్పించారు. మేమున్నాం అని మధుకర్ కుటుంబానికి ధైర్యం చెప్పారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ దౌర్జన్యం, అక్రమ కేసులు, స్థానిక కాంగ్రెస్ నాయకుల వేధింపులు,పోలీసుల బెదిరింపులు మధుకర్ మరణానికి కారణమని ఆవేదన వ్యక్తం చేశారు. మధుకర్ మృతికి బాధ్యులైన వారిని వెంటనే అరెస్ట్ చేసి, మిగతా 2లో..

# మందులు వికటించి విద్యార్థికి అస్వస్థత

కౌటాల, ప్రభాతవార్త

మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్టాఫ్ నర్స్ ఇచ్చిన మందులు వికటించి 11 సంవత్సరాల విద్యార్థిని ఆస్వస్థతకు గురైన సంఘటన సోమవారం రాత్రి జరిగింది.వివరాల్లోకి వెళ్తే మండల కేంద్రంలో జిల్లా యోగా గురువు దాసరి వినోద్ కూతురు దాసరి దార్మిక స్థానిక ప్రైవేటు పాఠశాలలో ఐదవ తరగతి చదువుతుంది.ఆమెకు తల పైన చిన్న కురుపు అయింది దాని కోసం తండ్రి వినోద్ అతని కూతురు దార్మిక సోమవారం మధ్యాహ్నం రెండు గంటల సమయంలో ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లారు.కానీ ఆ సమయంలో వైద్యాధికారి పవన్ కళ్యాణ్ అందుబాటులో లేకపోవడంతో డ్యూటీలో ఉన్న స్టాఫ్ నర్స్ నిరోషా ఏమైంది అని మిగతా 2లో..



# విద్యార్థుల సంక్షేమంపై దృష్టి సారించాలి

**(మొదటిపేజీ తరువాయి)**

విద్యార్థుల సంక్షేమంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో బెస్ట్ అవైలబుల్ పాఠశాలల పథకం క్రింద ఎంపిక చేసిన పాఠశాలలో చదివే షెడ్యూల్డ్ కులములు, షెడ్యూల్ తెగలకు చెందిన విద్యార్థుల సంక్షేమంపై ఆయా జిల్లాల కలెక్టర్లు దృష్టి సారించాలని, వారికి అందిస్తున్న బోధన, ఆరోగ్యం, మెనూ ప్రకారం భోజనం, ఇతర మౌలిక వసతుల అమలుపై పాఠశాలలను సందర్శించి పరిశీలించాలని తెలిపారు. ఎంపికైన ప్రతి విద్యార్థి పాఠశాలలో ఉండాలని, ఏమైనా సమస్యలు ఉంటే ఆయా పాఠశాలల యాజమాన్యాలతో చర్చించి పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవాలని, విద్యా సంవత్సరానికి ఎలాంటి ఆటంకం కలగకుండా కృషి చేయాలని తెలిపారు. కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే, జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి రమాదేవి, జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి నదీమ్ అహ్మద్, షెడ్యూల్డ్ కులాల సంక్షేమ శాఖ అధికారి మండల్ లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ బెస్ట్ అవైలబుల్ పాఠశాలలలో భాగంగా ఎంపికైన విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. విద్యార్థులకు అందిస్తున్న బోధన, ఆరోగ్యం, మౌలికవస్తుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని, విద్యార్థుల హాజరును పర్యవేక్షిస్తూ హాజరు శాతం పెంపొందించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# బాధ్యులను వెంటనే అరెస్ట్ చేయాలి

**(మొదటిపేజీ తరువాయి)**

చట్టపరంగా కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. మధుకర్ ఆత్మహత్య కేసులో దోషులను శిక్షించే వరకు బిజెపి పోరాటం చేస్తుందని తెలిపారు. ఎఫ్ఐఆర్ కాపీలో పేర్లు ఉన్నప్పటికీ పోలీసులు ఇప్పటివరకు ఎందుకు అరెస్టు చేయలేదని ప్రశ్నించారు. ఇవాళనే రామగుండం పోలీస్ కమిషనర్‌ను కలిసి కేసు పురోగతిపై చర్చించనున్నట్లు తెలిపారు. బిజెపి పార్టీ ఎల్లప్పుడూ కార్యకర్తలకు అండగా ఉంటుందని ఎవరు కూడా మన ధైర్యం కోల్పోవద్దని మీకు అన్ని విధాలుగా పార్టీ ఆదుకుంటుందని తెలిపారు. వీరితో బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి ఎన్.వీ. సుభాష్, బిజెపి రాష్ట్ర కార్యదర్శి భరత్ ప్రసాద్, మాజీ ఎంపీ వెంకటేష్ నేత, మంచిర్యాల జిల్లా అధ్యక్షులు వెంకటేశ్వర్ గౌడ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొయ్యల హేమ్మాజీ, గోమాస శ్రీనివాస్, దుర్గం అశోక్, మండల బిజెపి నాయకులు, తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### పరామర్శలో బిజెపి నేతల మధ్య మాటల యుద్ధం..

### గోమాస శ్రీనివాస్ వర్సెస్ బోర్లకుంట వెంకటేష్ నేత

**వేమనపల్లి, అక్టోబర్ 14, ప్రభాతవార్త**

మధుకర్ కుటుంబాన్ని పరామర్శించడానికి వచ్చిన బిజెపి నాయకులు ఒకరినొకరు తిట్టుకున్నారు. మాజీ ఎంపీ బోర్లకుంట వెంకటేష్ నేత, సీనియర్ నాయకులు గోమాస శ్రీనివాస్ ఇద్దరు అరేయ్, ఒరేయి, అనడంతో పాటు మాజీ ఎంపీని చెంప పగులుద్ది అని గోమాస శ్రీనివాస్ అనడంతో, గుడ్డలూడాదీసి కొడతా అని వెంకటేష్ నేత అన్నారు. ఈ క్రమంలో రాష్ట్ర అధ్యక్షులు రామచందర్ రావు ఇద్దరిని సముదాయించడంతో గొడవ సద్దుమణిగింది. ఓ వైపు బిజెపి నేతను కోల్పోయి పరామర్శించేందుకు వచ్చిన నేతలే రాష్ట్ర అధ్యక్షుడి ముందు ఒకరినొకరు దూషించుకోవడంతో బిజెపి నేతల్లో చర్చంశంగా మారింది. దీంతో నీల్వాయికి వచ్చింది తిట్టుకోవడం కోసమా అని ప్రతిపక్ష పార్టీల నాయకులు వీడియోలు వైరల్





# మానవత్వం చాటుకున్న అటవీశాఖ అధికారులు

**లింగాపూర్, అక్టోబర్ 14, ప్రభాతవార్త**

మండలంలోని మోడీగూడ గ్రామానికి చెందిన కనక భీమ్రావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన భార్య రెండు సంవత్సరాల క్రితమే మృతి చెందగా వారి పిల్లలు ఆరుగురు చిన్నారులు పూర్తిగా అనాథాలుగా మిగిలారు. ఈ విషాదకరమైన ఘటన సామాజిక మధ్యమాల ద్వారా వెలుగులోకి రావడంతో. ఈ హృదయ విధారక పరిస్థితిని గమనించిన జైనూర్ జోనల్ అటవీ శాఖ అధికారి మహేష్, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ అనూష, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ ఓంకార్ ఆ పిల్లలను పరామర్శించి ధైర్యం చెప్పి నిత్యావసర సరుకులు ఇవ్వడం జరిగింది.

# కన్నాల గ్రామ పంచాయతీ భూములు కబ్జాదారులకు కల్పతరువు

**(మొదటిపేజీ తరువాయి)**

బెల్లంపల్లి నియోజకవర్గంలోని కన్నాల గ్రామపంచాయతీ నందు నెమిల్ల గుట్టని కొంతమంది రియల్ ఎస్టేట్, రాజకీయ పలుకుబడి ఉన్న వ్యక్తులు గుట్టను మాయం చేసి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తూ ఫ్లాట్లు చేసినారు. ఈ యొక్క ప్రాంతంలో దాదాపు 20, 30 సంవత్సరాల క్రితం నెమిళ్ళ గుట్ట ఉండేది. ఇక్కడ నెమళ్ళు, ఉండేవి అందుకే ఆ గుట్ట ప్రాంతాన్ని నెమిల్ల గుట్ట అని నామకరణం ఉండేది. కానీ, కరోనా కాలం వినియోగించుకొని కొంతమంది భూ కబ్జామాఫియా వ్యక్తులు గుట్టను నామరూపాలుగా లేకుండా చేసి ఆ మట్టిని అక్కడ ఉన్నటువంటి చెరువు నందు నింపి చెరువు కూడా లేనివిధంగా ఫ్లాట్లు చేసి విక్రయిస్తున్నారు. దీనికి గతంలో అధికారంలో ఉన్న టిఆర్ఎస్ నాయకులు కూడా వత్తాసు పలికిన సంఘటనలు ఉన్నాయి. ఈ యొక్క ప్రాంతమంతా బఫర్ జోన్ క్రింద వస్తుంది. అయినా యదేచ్ఛగా తిరుమల హిల్స్ పేరుతో ఫ్లాట్లు చేసి విక్రయించడం జరుగుతున్నది. తిరుమల హిల్స్‌తో పాటు ఇంకో రెండు పేర్లతో రియల్ ఎస్టేట్ వ్యాపారం కొనసాగిస్తున్నారు. ఇప్పటికైనా నియోజకవర్గ ఎమ్మెల్యే, చొరవ తీసుకుని నేమిళ్ల గుట్ట తొలగించుటకు సహకరించిన నాయకులపై మరియు ఫ్లాట్లు విక్రయిస్తున్న తిరుమల హిల్స్ వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సిందిగా డిమాండ్ చేస్తున్నాం. అలాగే కన్నాల గ్రామపంచాయతీలో గల సర్వే నంబర్ 60లో 55 ఎకరాల 18 గుంటలు ప్రభుత్వ భూమిని భూమిలేని పేదలకు ఇంద్రమ్మ గృహాలకు కేటాయించాలి. లేనిపక్షంలో జరగబోయే ఆందోళన కార్యక్రమాలకు ఇరిగేషన్ డిపార్ట్మెంట్, సంబంధిత అధికారులు బాధ్యత వహించవలసి ఉంటుందని రైతు కార్మికుల సంఘాల వేదిక డిమాండ్ చేస్తున్నదన్నారు. ఈ కార్యక్రమంలో మని రామ్ సింగ్ తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షులు, యండి. చాంద్ పాషా సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ రాష్ట్ర నాయకులు, అంబాల మహేందర్ సింగరేణి గని కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు, గోగర్ల శంకర్ ఏఐకేకేఎస్ రాష్ట్ర నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## అక్షరాలు చెప్పలేదని విద్యార్థిని చితకబాదిన ఉపాధ్యాయుడు

**కౌటాల, ప్రభాతవార్త**



పాఠశాలలో విద్యాబుద్ధులు నేర్పాల్సిన ఉపాధ్యాయులు విద్యార్థిని జంతువును కొట్టినట్టు కొట్టిన ఘటన మండలంలోని ముత్తంపేట బారెవాడ ప్రాథమిక పాఠశాలలో సోమవారం జరిగింది. పాఠశాలలో ఒకటో తరగతి చదువుతున్న గాండ్ల కార్తీక్ అనే విద్యార్థి బోర్డుపై ఇంగ్లీష్ అక్షరాలు చూసి చదవమని ఉపాధ్యాయుడు సాయి చెప్పడంతో కార్తీక్ తడ బడి చెప్పలేకపోయాడు. దీంతో కోపంతో ఉపాధ్యాయుడు సాయి విద్యార్థి కార్తీక్ పై కట్టె తో విచక్షణ రహితంగా కొట్టాడు. ఈ దెబ్బలు కార్తీక్ ఎడమ చేతి భుజం కుడికాలు పిక్కల వరకు దెబ్బలు చర్మం పొంగిపోయింది సాయంత్రం కార్తీక్ పాఠశాల అయిపోయాక ఇంటికి పోవడంతో తల్లి ఏమైంది అడగగా మొదట ఏం కాలేదని చెప్పాడు. అనుమానం వచ్చి తల్లి కార్తీక్ ను షర్టు విప్పి చూడగా చేయి మొత్తం దెబ్బలతో ఉండగా కాలి వరకు ఉన్న దెబ్బలను ఒక్కసారిగా చూసి ఆవేదనకు గురైంది. విద్యార్థి తండ్రి తిరుపతి మంగళవారం ఉదయం విషయాన్ని మీడియాకు చెప్పడంతో విషయం బయటకు వచ్చింది. ఈ విషయం గురించి పాఠశాలకు వెళ్లి హెచ్ఎం తిరుపతిని ఎలా జరిగిందని అడగగా అప్పుడప్పుడు అలా జరుగుతాయని కొట్టడం సహజమని ఈసారి ఇంత పెద్దగా అయితదని అనుకోలేదు అని నిరక్ష్యపు సమాధానం ఇచ్చాడు. ఇదే విషయంపై ఎంఈఓ గావుడే హనుమంతును వివరణ కోరగా ఏ పాఠశాలలో కూడా విద్యార్థులను ఉపాధ్యాయులు కొట్టడం తప్పు అని గాయపడిన విద్యార్థి వాళ్ళ ఇంటికి వెళ్లి గాయాలు పరిశీలించారు. సదరు ఉపాధ్యాయుల తీరుపై జిల్లా అదనపు కలెక్టర్, జిల్లా విద్యాధికారి దృష్టికి తీసుకెళ్తానాన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామన్నారు. మండల వ్యాప్తంగా ఎక్కడ కూడా ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉపాధ్యాయులందరిని ఆదేశిస్తామన్నారు.

## మందులు వికటించి విద్యార్థికి అస్వస్థత

**(మొదటిపేజీ తరువాయి)**

అడగగా సమస్యను వివరించారు. ఆమె కొన్ని టాబ్లెట్లు ఇచ్చి వేసుకోమని తగ్గుతుందని తెలిపింది. సాయంత్రం 8:30 గంటల ప్రాంత సమయంలో ధార్మిక ఆ టాబ్లెట్లు వేసుకుంది వేసుకున్న 10 నిమిషాలకి ఆమె పెదవులు దురదలు వచ్చి ఉబ్బినాయి. శరీరమంతా దురదలు తీవ్రమైన చలి రావడంతో వెంటనే ఆమెను తీసుకొని దవాఖానకు వెళ్లారు. అప్పటికి పిహెచ్‌సిలో ఎవరూ లేకపోవడంతో నైట్ డ్యూటీలో ఉన్న వాచ్‌మెన్ వైద్యాధికారికి ఫోన్ చేయగా వైద్య అధికారి వచ్చారు. అక్కడికి వచ్చిన వైద్యాధికారి మొదట ఇది ట్యాబ్లెట్ల వల్ల కాదు ఏదో పురుగులేదా వేరే ఏమైనా కుట్టడం వల్ల ఇలా జరిగి ఉంటుందని, ఇక్కడ కాదు మీరు బయటకు వెళ్ళి చికిత్స చేయించుకోవాలని దుబాయించాడు. అలా ఎలా అవుతుందని మీ సిబ్బంది ఇచ్చిన టాబ్లెట్ల వల్లే ఇలా అయిందని బాధితులు తెలపడంతో కాదని వైద్యాధికా తెలిపినట్టు బాధితులు తెలిపారు. అదే సమయంలో అక్కడకు మీడియా వాళ్ళు చేరుకోవడంతో సిబ్బందితో అప్పుడు ట్రీట్మెంట్ చేసేందుకు ముందుకు వచ్చాడు. తీరా టాబ్లెట్ రియాక్షన్ వల్లే అని ఒప్పుకొని దానికి ఒక ఇంజక్షన్ వేయాలి బయట నుండి తీసుకురావాల్సిందిగా చెప్పాడు. ఆ ఇంజక్షన్ బాధితుల తరపు వాళ్ళు ఇంజక్షన్ తెచ్చుకున్న తర్వాత ఇంజక్షన్ వేశాడు. ఆ తర్వాతే వైద్యాధికారి 108 కు ఫోన్ చేసి అందులో సిర్పూర్ సామాజిక దవాఖానకు పంపారు. మంగళవారం సాయంత్రం డిశ్చార్జ్ అయినట్లు విద్యార్థిని తండ్రి వినోద్ తెలిపారు.

### మాజీ ఎమ్మెల్యే కామ్రేడ్ గుండా మల్లేష్‌కు ఘన నివాళ్ళు

**వాంకిడి, అక్టోబర్ 14, ప్రభాతవార్త**

మాజీ ఎమ్మెల్యే కామ్రేడ్ గుండా మల్లేష్ 5వ వర్ధంతి సందర్భంగా వాంకిడి మండల కేంద్రమైన జేత్వాన్ బుద్ధ విహార్‌లో భారతీయ బౌద్ధ మహా సభ, అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఘన నివాళులర్పించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయన ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు వాంకిడి మండలం చేసిన సేవలను కొనియాడారు. కార్మిక కుటుంబం నుండి వచ్చిన దళిత నేత గుండా మల్లేష్ అంచెలు అంచెలుగా ఎమ్మెల్యే స్థాయికి ఎదిగి అనేక మందికి ఆదర్శంగా నిలిచారని భారతీయ బౌద్ధ మహాసభ జిల్లా అధ్యక్షులు అశోక్ మహుల్కర్, ప్రధాన కార్యదర్శి విజయ్ ఉప్రేలు అన్నారు. ఈ కార్యక్రమంలో భారతీయ బౌద్ధ మహాసభ అంబేద్కర్ సంఘం గౌరవ అధ్యక్షులు జయరాం, ఉప్రే ప్రధాన కార్యదర్శి విజయ్ ఉప్రే, కార్యదర్శి రోషన్ ఉప్రే, బౌద్ధ సమాజ్ అధ్యక్షులు శ్యామ్ రావు లహుజీ దుర్గే, రాజేశ్వర్ ఉప్రే, బీఎస్పీ మండల అధ్యక్షులు శ్యామ్ రావు దొండుజి దుర్గే, బౌద్ధ ఉపాసకులు పాండుజి జాడే, చునార్కర్ విఠల్, భీమ్ రావు, సిద్ధార్థ యువజన సంఘం నాయకులు దుర్గం దీపక్, కొయ్యల మహేష్, దుర్గం మనోజ్, నూతన్, ముంజం అన్నారావు తదితరులు పాల్గొన్నారు.



## కరాటే మాస్టర్ల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

**ఆసిఫాబాద్, అక్టోబర్ 14, ప్రభాతవార్త**

కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని 15 పీఎంశ్రీ పాఠశాలలోని బాలికలకు కరాటే శిక్షణ తరగతులు నేర్పించడం కోసం కరాటే మాస్టర్ల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి దీపక్ తివారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వారానికి 6 క్లాసుల చొప్పున నెలకు 24 క్లాసులు 3 నెలల పాటు కరాటే శిక్షణ ఇవ్వాలని తెలిపారు. దీనికిగాను బ్లాక్ బెల్ట్ సర్టిఫికెట్ కలిగిన మాస్టర్లు ఈ నెల 15 నుంచి 18 సాయంత్రం 5 గంటల వరకు కలెక్టరేట్ లోని విద్యాశాఖ అధికారి కార్యాలయం రూమ్ నెంబర్ ఎస్-17లో పాఠశాలల వారీగా దరఖాస్తు చేసుకోవాలని, పాఠశాల జాబితా కార్యాలయ నోటీసు బోర్డుపైన ప్రదర్శించినట్లు తెలిపారు. స్థానికత, బ్లాక్ బెల్ట్ సర్టిఫికేట్, పూర్వపు అనుభవం, వారి ప్రతిభ ఆధారంగా ఎంపిక ఉంటుందన్నారు. మహిళా కరాటే మాస్టర్లకు ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని డిఈఓ తెలిపారు.



## సాఫ్ట్ బాల్ పోటీల ఎంపిక

**బజార్‌హత్నూర్, అక్టోబర్ 14, ప్రభాతవార్త**

మండల కేంద్రంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో అండర్ 17 బాల బాలికల సాఫ్ట్ బాల్ పోటీల ఎంపిక నిర్వహించారు. పోటీలను స్కూల్ గేమ్స్ సెక్రటరీ ఆడే రామేశ్వర్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జె. భూమన్న, ఎస్కె అఖిల్ పిఈటిలు పాల్గొని ఈ పోటీలను ప్రారభించారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబర్చిన వారు రాష్ట్ర స్థాయిలో జరిగే పోటీలకు వెళతారని వారు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.



## రోటిగూడెంలో ఓటు చోరిపై అవగాహన

**జన్నారం, అక్టోబర్14, ప్రభాతవార్త**

ఖానాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ఆదేశాల మేరకు మండలంలోని రోటి గూడ గ్రామంలో మంగళవారం రోజున ఎన్ఎస్‌యూఐ, యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఓటు చోరీ అంశంపై సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. బిజెపి దేశంలో ఏ విధంగా ఓటు చోరీ చేస్తున్న విధానాన్ని ప్రజలకు వివరించి సంతకాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర నాయకుడు సోహైల్ షా, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దాసరి గణేష్, రోటి గూడ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత గాలికుంటు నివారణ టీకాలు సద్వినియోగం చేసుకోవాలి

**బజార్‌హత్నూర్, అక్టోబర్ 14, ప్రభాతవార్త**

మండలంలోని అన్ని గ్రామాలలో నేటి నుంచి నవంబర్ 9వ తేదీ వరకు వరకు అన్ని గ్రామాలలో ఉచిత గాలికుంటు నివారణ టీకాల కార్యక్రమం నిర్వహించబడుతుంది. ఈ అవకాశాన్ని పశువులు ఉన్న రైతులు అందరూ సద్వినియోగం చేసుకోవాలని మండల పశు వైద్య డాక్టర్ పర్వీద్ అహ్మద్ సూచించారు.

## జిల్లా బీసీ జేపీసీ చైర్మన్ గా రూప్నర్ రమేష్

**ఆసిఫాబాద్, అక్టోబర్ 14, ప్రభాతవార్త**

కొమరం భీమ్ అసిఫాబాద్ జిల్లా బీసీ జేఏసీ చైర్మన్‌గా బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు రూప్నర్ రమేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం ఆసిఫాబాద్ పట్టణంలోని బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన వివిధ బీసీ సంఘాలు, కుల సంఘాల ప్రతినిధులతో ఏర్పాటు చేసిన సమావేశంలో బీసీ జేఏసీ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా కోఆర్డినేటర్‌గా ఆవిడపు ప్రణయ్, వైస్ చైర్మన్‌లుగా కాంద్రే విశాల్, మాచర్ల శ్రీనివాస్, గాజుల జక్కయ్య, నీకోడే రవీందర్, దీపక్ ముండే, పొన్న రమేష్, కార్యవర్గ సభ్యులుగా కోట వెంకన్న, బోర్కుటే తిరుపతి, లాహుకుమార్, మేరాజ్, పురుషోత్తం, బాలేష్, రాపర్తి కార్తీక్, మామిడి కిరణ్, పర్రె గిరి, నాందేవ్, నాగపూరి మారుతీ, షేక్ అసద్ ఉమేందర్ ఎంపికయ్యారు.

# సకల సదుపాయాలతో కూడిన నాణ్యమైన విద్య అందించే దిశగా ప్రభుత్వం కృషి

**- మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**లక్షెట్టిపేట, అక్టోబర్ 14, ప్రభాతవార్త**



ప్రభుత్వ విద్యా సంస్థలను బలోపేతం చేస్తూ విద్యార్థులకు సకల సదుపాయాలతో కూడిన నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని హాజీపూర్, లక్షెట్టిపేట మండల కేంద్రాలలో గల కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాలను ఆకస్మికంగా సందర్శించి తరగతి గదులు, వంటశాల, మధ్యాహ్న భోజనం నాణ్యత, రిజిస్టర్లు, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలలో అన్ని సదుపాయాలు కల్పించి నిష్ణాతులైన ఉపాధ్యాయులతో గుణాత్మక విద్యను అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. విద్యార్థులకు మెనూ ప్రకారం సకాలంలో పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందించాలని, శుద్ధమైన త్రాగునీటిని అందుబాటులో ఉంచాలని, విద్యార్థుల ఆరోగ్య పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. విద్యార్థుల హాజరు శాతాన్ని నిరంతరం పర్యవేక్షిస్తూ గైర్హాజరు అయినట్లయితే, అందుకు గల కారణాలను తెలుసుకోవాలని, విద్యార్థుల హాజరు శాతం పెంపొందించేలా ఉపాధ్యాయులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని, తరగతిలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారిపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. పాఠశాల తరగతి గదులు, వంటశాల, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, వ్యక్తిగత పరిశుభ్రత పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించాలని, పారిశుద్ధ్య నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని తెలిపారు. 10వ తరగతి వార్షిక పరీక్షలలో ఉత్తమ ఫలితాలు సాధించే దిశగా ఉపాధ్యాయులు విద్యార్థులను సన్నద్ధం చేయాలని తెలిపారు. సెలవులు పూర్తిచేసుకుని తిరిగి పాఠశాలకు హాజరు కాని విద్యార్థుల తల్లిదండ్రులను ఫోన్ లో సంప్రదించి విద్యార్థులు పాఠశాలకు వచ్చే విధంగా ఉపాధ్యాయులు చర్యం తీసుకోవాలని తెలిపారు. అనంతరం 10వ తరగతి విద్యార్థులకు పాఠ్యాంశాలు బోధించి వారి అభ్యాసనా సామర్థ్యాలను పరీక్షించారు. జిల్లాలోని తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ విద్యాసంస్థలో విద్యనభ్యసించి నీట్ పరీక్షలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి నిర్మల్ జిల్లాలో ఎం.బి.బి.ఎస్. సీటు సాధించిన విద్యార్థినిని స్ఫూర్తిగా తీసుకుని చదువులో రాణించాలని, ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు

## దళిత విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతున్న రాష్ట్ర ప్రభుత్వం

**బెల్లంపల్లి, అక్టోబర్ 14, ప్రభాతవార్త**

రాష్ట్రవ్యాప్తంగా బెస్ట్ అవైలబుల్ స్కూల్ పథకం ద్వారా విద్యనభ్యసిస్తున్న దళిత విద్యార్థుల పెండింగ్ బకాయిల విడుదల చేయాలని కోరుతూ ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ప్లకార్డులతో నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు చిప్పకుర్తి శ్రీనివాస్ (టీవీయువి), చేరాల వంశీ (జెఎస్వి)లు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా సుమారు 30 వేల మంది దళిత విద్యార్థులు బెస్ట్ అవైలబుల్ పాఠశాల పథకం ద్వారా విద్యను అభ్యసిస్తున్నారు వారికి ప్రభుత్వం చెల్లించాల్సి న ఫీజు బకాయిలు చెల్లించకపోవడంతో వారి భవిష్యత్తు ప్రమాదంలో పడిందని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఫీజులు చెల్లించకపోవడం వలన ప్రైవేట్ పాఠశాలలు విద్యార్థులను తరగతులకు అనుమతించడం లేదని దీంతో విద్యార్థులు చదువులు అగమ్య గోచరంగా మారాయని అన్నారు. ప్రభుత్వం విద్యార్థులకు చెల్లించాల్సి న బకాయిల విషయంలో సవతి తల్లి ప్రేమ చూపించడం సిగ్గుచేటని దుయ్యబట్టారు. వెంటనే ప్రభుత్వం స్పందించి పెండింగ్‌లో ఉన్న బెస్ట్ అవైలబుల్ పాఠశాల నిధులను విడుదల చేయాలని లేని పక్షంలో విద్యార్థులను, వారి తల్లిదండ్రులను కలుపుకొని ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని అన్నారు.





## స్వదేశీ ఉత్పత్తుల్లో స్వచ్ఛత

**బెల్లంపల్లి, అక్టోబర్ 14, ప్రభాతవార్త**

స్వదేశీ వస్తువులు స్వచ్ఛంగా, నాణ్యతగా ఉంటాయని బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ ఎం. విజయ భాస్కర్ రెడ్డి అన్నారు. మంగళవారం గోలేటి సిఈఆర్ క్లబ్‌లో వావిలాల ఖాదీ గ్రామోద్యోగ్ ప్రతిస్తాన్ వారు ఏర్పాటు చేసిన ఖాదీ మేళ స్టాల్‌ని జీఎం ప్రారంభించారు. గాంధీ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. స్టాల్ లోని వస్త్రాలను పరిశీలించారు. రాయితీ వివరాలు ఉద్యోగులకు స్పష్టంగా వివరించాలని జనరల్ మేనేజర్ నిర్వాహకులకు సూచించారు. ఈ నెల 19వ తేదీ వరకు నిత్యం ఉధయం 9 గంటల నుండి రాత్రి 9 గంటల వరకు మేళా నిర్వహించ బడుతుందని, వస్త్రాల కొనుగోలుపై 25 నుండి 40 శాతం వరకు రాయితీ ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. సింగరేణి కార్మికులకు 20 వేల వరకు వస్త్రాలను క్రెడిట్ పై అందిస్తామని 5 వాయిదాలలో చెల్లింపు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి నాయకుడు ఎస్ తిరుపతి, ఎస్ఓటు జిఎం కె. రాజమల్లు, ఏరియా ఇంజినీర్ కృష్ణ మూర్తి, డీజీఎం (ఐఈడి) ఉజ్వల్ కుమార్ బెహరా, పర్స నల్ డిపార్ట్మెంట్ హెచ్ఓడి ఎం. శ్రీనివాస్, ఫైనాన్స్ మేనేజర్ రవికుమార్, నిర్వాహకులు చంద్రమోళి, అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.



## అప్పారావుపేటకు బస్సు నడపాలని ఆర్టీసీ డిపో మేనేజింగ్‌కు వినతి

**సారంగాపూర్, అక్టోబర్ 14, ప్రభాతవార్త**

గత సంవత్సరం నుండి నిర్మల్ నుండి అప్పారావుపేటకు రాత్రి 8:30 గంటల బస్సు సేవలు నిలిపివేయబడటం వల్ల తండా ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలు తీవ్రమైన ప్రయాణ ఇబ్బందులకు గురవుతున్నారు. ముఖ్యంగా సాయంత్రం వేళల్లో బస్సు సౌకర్యం లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు గురవుతున్నారు. ప్రైవేట్ వాహనాల్లో ప్రయాణం చేయాల్సిన పరిస్థితి దాపురించిందని పేర్కొన్నారు. ఈ సమస్య పరిష్కారానికి కోరుతూ, రాత్రి బస్సును మళ్లీ యథాతథంగా నడపాలనే అభ్యర్థనతో తండా గ్రామాల మాజీ సర్పంచులు నిర్మల్ డిపో మేనేజర్ కె. పండరికి వినతిపత్రం అందజేశారు. ఈ వినతి కార్యక్రమంలో దుప్య తాండా మాజీ సర్పంచ్ జాదవ్ ప్రహ్లాద్, కుప్టీ గ్రామ మాజీ సర్పంచ్ జాదవ్ కైలాష్, రాథోడ్ నారాయణ, పవర్ కైలాష్ తదితరులు పాల్గొన్నారు.



## న్యూ లోలంలో పర్యటించిన డీఎల్పీఓ లింగయ్య

**దిలావర్‌పూర్, అక్టోబర్ 14, ప్రభాతవార్త**

తడి చెత్త ద్వారా సేంద్రియ ఎరువుల తయారుచేసి రైతులకు విక్రయించి పంచాయతీకి ఆదాయం తీసుకురావాలని డీఎల్పీఓ లింగయ్య అన్నారు. మంగళవారం దిలావర్పూర్ మండలం న్యూ లోలం గ్రామపంచాయతీని సందర్శించారు. డంపింగ్ యార్డ్‌లో తడి పొడి చెత్తను వేరు చేసి తడి చెత్తతో సేంద్రీ ఎరువులు తయారు చేయాలని తెలిపారు. ఆ ఎరువులను బస్తాలలో నింపి తక్కువ ధరలకే విక్రయించాలని తెలిపారు. దీంతో పంచాయతీకి ఆదాయం చేకూరుతుందని అన్నారు. అనంతరం గ్రామంలోని ప్రాథమిక పాఠశాల, అంగన్వాడి కేంద్రాన్ని, నర్సరీని, పంచాయతీ రికార్డులను పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేసి పంచాయితీ అభివృద్ధికి పాటుపడాలని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను వేగవంతం చేసేలా, దశలవారీగా నిర్మాణాలను ఆన్‌లైన్‌లో పూర్తి వివరాలను పొందుపరచాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## కళాశాలకు పంపితేనే పిల్లలకు భవిష్యత్తు

### పిల్లల ఇంటి బాట పట్టిన అధ్యాపకులు

**దిలావర్పూర్, అక్టోబర్ 14, ప్రభాతవార్త**



విద్యార్థుల హాజరు శాతం పెంచేందుకు దిలావర్పూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు మంగళవారం విద్యార్థుల ఇంటి బాట పట్టారు. విద్యార్థుల ఇంటికి వెళ్లి ప్రతి రోజు తమ పిల్లలను కళాశాలకు పంపించాలని తల్లిదండ్రులకు తెలిపారు. ఈ 90 రోజులు ఇంటర్మీడియట్ విద్యార్థులకు చాలా కీలకమని తెలిపారు. వార్షిక పరీక్షలలో 100 ఉత్తీర్ణత సాధించాలి అంటే తమ పిల్లలను కరుమంతా లేకుండా కళాశాలకు రావాలని తెలిపారు. అధ్యాపకుల పర్యవేక్షణలో విద్యార్థులు సమర్థవైతే మంచి ఫలితాలు పొందవచ్చని పేర్కొన్నారు. కళాశాల ప్రిన్సిపల్ పి. సుదర్శన్ అధ్యాపకులతో సమావేశం ఏర్పాటు చేసి అధ్యాపకులను ఆరు క్లస్టర్‌గా విభజించి విద్యార్థుల ఇంటికి పంపించినట్లు అధ్యాపకులు పేర్కొన్నారు. ఇందులో జయశ్రీ, అనసూయ, శోభన్ బాబు, శ్రీలత, కృష్ణ, నర్సయ్య, జైపాల్, శ్రీనివాస్ ఉన్నారు.

# విద్యుత్ వినియోగదారులే దేవుళ్ళు..

### విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక చైర్‌పర్సన్ ఎరుకల నారాయణ

**బెల్లంపల్లి, అక్టోబర్ 14, ప్రభాతవార్త**



విద్యుత్ వినియోగదారులు దేవుళ్ళు అని, వారిని కాపాడుకుంటేనే విద్యుత్ శాఖ మనగడ సాధిస్తుందని లేకుంటే ప్రమాదంలో పడిపోతుందని విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక (ఉత్తర తెలంగాణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ) చైర్‌పర్సన్ ఎరుకల నారాయణ అన్నారు. బెల్లంపల్లి పట్టణ సబ్ డివిజన్ స్థాయి విద్యుత్ వినియోగదారుల సదస్సును మంగళవారం డివిజన్ కార్యాలయం ఆవరణలో నిర్వహించారు. ఈ సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై నారాయణ మాట్లాడారు. విద్యుత్ వినియోగదారులకు ఎలాంటి అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేయాలన్నారు. వినియోగదారులకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చూడాలని ఎప్పటికప్పుడు జవాబుదారీగా అధికారులు, సిబ్బంది పనిచేయాలన్నారు. వారిని కాపాడుకోకుంటే ఇతర ప్రైవేటు విద్యుత్ సంస్థలు ముందుకు వచ్చే ప్రమాదం నెలకొందన్నారు. ప్రతి సోమవారం ప్రజావాణి నిర్వహించి వినియోగదారుల సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించాలని అప్పుడే విద్యుత్తు సంస్థపై వినియోగదారులకు నమ్మకం రెట్టింపు అవుతుందన్నారు. బెల్లంపల్లి డివిజన్‌లోని విద్యుత్తు కార్యాలయాల్లో సిటీజన్ చార్టర్ బోర్డులను ఏర్పాటు చేసి కిందిస్థాయి నుంచి అన్ని విభాగాల అధికారుల మొబైల్ నంబర్లు బోర్డులపై రాయించాలని డివిజనల్ ఇంజనీర్ బానోతు రాజన్న ఇతర అధికారులను చైర్మన్ ఆదేశించారు. రైతులు తమ పొలాల్లో వినియోగిస్తున్న విద్యుత్తుకు విద్యుత్ మోటార్లకు కెపాసిటర్లు ఏర్పాటు చేసుకోవాలని, ఈ విషయమై అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రతి వినియోగదారుడికి ఎలాంటి సమస్య లేకుండా చూసిన నాడే విద్యుత్ బిల్లుల చెల్లింపులో పురోగతి వస్తుందన్నారు. విద్యుత్ వినియోగదారులకు అధికారులు సిబ్బంది ప్రతి ప్రాంతంలో 24 గంటలు సేవలు అందించాలని, వినియోగదారులకు విద్యుత్ సంస్థలపై వినియోగదారులకు నమ్మకం కలిగించేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. వినియోగదారులు లేకుంటే విద్యుత్ సంస్థ రానున్న రోజుల్లో ఉండబోతున్నారు. విద్యుత్ అధికారులు, సిబ్బంది ఈ విషయాన్ని గమనించి విధులు నిర్వహించాలన్నారు. ఈ సదస్సులో తెలంగాణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ టెక్నికల్ మెంబర్ సలండ్ల రామకృష్ణ, ఫైనాన్స్ మెంబర్ లకావత్ కిషన్, మంచిర్యాల జిల్లా విద్యుత్ శాఖ ఎస్ ఈ ఉత్తం జాదే, బెల్లంపల్లి డీ.ఈ బి. రాజన్న, ఈడీఈ ఎన్ రాజశేఖర్, టౌన్ ఏఈ మల్లేశం, ఈ ఆర్ వో శ్రీనివాస్, రూరల్ ఏ ఈ మదన్ మోహన్, టౌన్ సబ్ డివిజన్ పరిధిలోని అధికారులు సిబ్బంది రైతులు వినియోగదారులు పాల్గొన్నారు.

### వీధి లైట్లకు తాడ్ లైన్ ఏర్పాటు చేయాలి

విద్యుత్ వినియోగదారుల ఫోరం చైర్‌పర్సన్ నారాయణకు మాజీ కౌన్సిలర్ కటకం సతీష్ వినతి. బెల్లంపల్లి మున్సిపాలిటీలో వీధిలైట్లకు మూడవ విద్యుత్ లైన్ ఏర్పాటు చేయాలని, మున్సిపాలిటీ రూ 1.50 కోట్లు విద్యుత్ శాఖకు చెల్లించినందున అన్ని వార్డుల్లో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసేలా చర్యలు తీయియనుకోవాలని లేనియెడల నిరంతరం లైట్లు వెలుగుతూ ఉండడంతో మున్సిపాలిటీకి అధిక విద్యుత్ బిల్లు వస్తుందని దాన్ని నివారించేందుకు విద్యుత్ అధికారులు థర్డ్ లైన్ ఏర్పాటు చేసి వీధిలైట్లు నియంత్రించాలని కాంగ్రెస్ మాజీ కౌన్సిలర్ కటకం సతీష్ వినతి పత్రంలో కోరారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ వినియోగదారులు మరియు రైతులు తదితరులు పాల్గొన్నారు.

## సోషల్ వెల్ఫేర్ బాలుర గురుకుల పాఠశాల భవనాలకు మరమ్మతులు నిర్వహించాలి

### - సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు

**కాగజ్‌నగర్ రూరల్, అక్టోబర్ 14, ప్రభాతవార్త**

సిర్పూర్ (టి) సోషల్ వెల్ఫేర్ బాలుర గురుకుల పాఠశాల భవనాలకు మరమ్మతులు నిర్వహించాలని సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు ఎస్సీ, ఎస్టీ , మైనారిటీ వెల్ఫేర్ మంత్రి శ్రీ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను కోరారు. మంగళవారం హైదరాబాద్‌లోని మినిస్టర్స్ క్వార్టర్స్‌లో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మర్యాద పూర్వకంగా కలిసి సమస్యలపై విన్నవించారు. ఈ సందర్భంగా సిర్పూర్ (టి)లోని బాలుర ఎస్సీ గురుకుల పాఠశాలకు వెంటనే మరమ్మతులు నిర్వహించి 500 మంది విద్యార్థులు చదువుతున్న ఈ పాఠశాలలో విద్యా సంవత్సరం నష్టపోకుండా చూడాలని మంత్రిని కోరినట్లు తెలిపారు. సానుకూలంగా స్పందించిన మంత్రి మరమ్మతులకు నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారన్నారు. సిర్పూర్ ఎమ్మెల్యేతో పాటు, ముధోల్ శాసన సభ్యులు రామారావు పటేల్ ఉన్నారు.



## ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి

### - పశువైద్యాధికారి అడ్లూరి పరిమళ

**కాగజ్‌నగర్ రూరల్, అక్టోబర్ 14, ప్రభాతవార్త**

పశువైద్య మరియు పశుసంవర్ధక శాఖ, తెలంగాణ ప్రభుత్వం ద్వారా నెల రోజుల పాటు నిర్వహించే ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని పశు పోషకులు సద్వినియోగం చేసుకోవాలని కాగజ్‌నగర్ మండల పశువైద్యాధికారిణి డాక్టర్ అడ్లూరి పరిమళ అన్నారు. ఈనెల 15వ తేదీ నుండి నవంబర్ 14వ తేదీ వరకు నెల రోజుల పాటు కాగజ్‌నగర్ మండల పరిధిలో గాలి కుంటు వ్యాధి (ఎఫ్ఎండి) నివారణ టీకా కార్యక్రమం నిర్వహించడుదున్నారు. మండలంలోని అన్ని ఆవులు, గేదెలు,దూడలకు ఈ టీకా ఉచితంగా ఇవ్వడం జరుగుతుందని పశువుల యజమానులు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని తమ పశువులకు టీకా తప్పక టీకాలు వేయించుకోవాలన్నారు. పశువులకు సోకే వ్యాధుల్లో ప్రధానమైన గాలికుంటు వ్యాధిని అరికట్టడానికి ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## జాతీయ రహదారి విస్తరణ ప్రక్రియ వేగవంతం చేయాలి

### - మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**నస్పూర్, అక్టోబర్ 14, ప్రభాతవార్త**

జిల్లాలో జాతీయ రహదారి విస్తరణ ప్రక్రియ వేగవంతం చేయాలని, ప్రభావిత గ్రామాలలో అవార్డుల జారీ ప్రక్రియ త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని మంచిర్యాల రాజస్వ మండల అధికారి కార్యాలయంలో రాజస్వ మండల అధికారి శ్రీనివాస్ రావుతో కలిసి జాతీయ రహదారి విస్తరణలో ఆర్బిట్రేషన్ సంబంధిత రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ రహదారి విస్తరణలో భాగంగా ప్రభావిత గ్రామాలలో అవార్డుల జారీ ప్రక్రియ వేగవంతం చేసి, ఆర్బిట్రేషన్ సంబంధిత రికార్డులను పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఘన్‌పూర్ చింతల్ బోరీ అడవుల్లో
# పెద్దపులి, చిరుత సంచారం

**(మొదటిపేజీ తరువాయి)**

చేసిన చెక్ డ్యాముల ఆయకట్ట తెగిపోయి నిల్వ ఉండాల్సిన నీరు పక్కకు పోవడంతో గమనించిన ఎఫ్ ఆర్ ఓ వారి సిబ్బంది నీరు మళ్ల కుండా కట్ట వైపు రాళ్ల పేర్చారు. అటువైపుగా వస్తున్న పశువుల కాపరులకు అడవుల్లోకి వెళ్ళకూడదని పులి సంచరిస్తున్నట్లు తెలిపారు. ఇది ఇలా ఉండగా వారం రోజుల క్రితం పిప్పల్ దారి గ్రామనికి చెందిన సిడం లక్ష్మణ్ అనే రైతు పొలంలో కోతుల కాపలా కోసం కట్టేసిన రెండు శునకాలను చిరుత దాడి చేసి హతమార్చినట్లు తెలిపారు. ఇది తెలిసిన ఫారెస్ట్ అధికారులు అప్రమత్తం అయ్యారు. పంట చేలలో విద్యుత్ తీగలు అమర్చ రాదని , విష ప్రయోగాలు చేయకూడదని. వన్యపాణి సంరక్షణ



చట్టం కింద కేసులు నమోదు చేయబడుతుందని ఎఫ్ ఆర్ వో ప్రణయ్ సూచించారు.

# అడవిపందుల దాడులతో రైతుల ఆవేదన

**- పంట పొలాలు, పత్తి చెల్కు నాశనం - నష్ట పరిహారం కోరుతున్న రైతులు**



పెంచికల్‌పేట్, ప్రభాతవార్త

పెంచికల్ పేట్ మండలంలోని పలు గ్రామాల్లో రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి పూట అడవి పందుల దాడులతో పత్తి, వరి మొక్కజొన్న పంటలు నాశనం అవుతున్నాయి. రైతులు ఆరుగాలం కష్టపడి సాగు చేసిన పంటలు చేతికొచ్చే దశలో అటవీ జంతువుల పాలవ్వడంతో రైతులు తీవ్ర నిరాశకు గురవుతున్నారు. ముఖ్యంగా అటవీ పరిసర ప్రాంత గ్రామాలైన దర్గాపల్లి, బొంబాయిగూడ, ఎల్కపల్లి, లోడ్పల్లి, కొండపల్లి, జైహింద్పూర్, అగర్గుడా, మెరగుడా, కమ్మార్గం, గుండెపల్లి, నందిగాం, మురళీగూడ ప్రాంతాల్లోని చెల్క పొలాల్లోకి రాత్రి వేళల్లో పందులు పెద్ద గుంపులుగా వచ్చి పత్తి మొక్కలను కూలదోసి వరి పొలాల్లో గింజలను తింటున్నాయని దీంతో పొలాల చుట్టూ సోలార్ పెనిషింగ్ ఏర్పాటు చేసి గస్తీ కాస్తూ కట్టెలు, టిన్నులు, వెలుగులు బాణాసంచాలు పేలుస్తూ చప్పుళ్ళు చేస్తూ జంతువులను తరిమేందుకు ప్రయత్నం చేస్తున్న పెద్దగా ఫలితం కనిపించడం లేదని రైతులు తెలుపుతున్నారు.

### రైతుల వేదన...

ప్రతి సంవత్సరం వర్షాధారంపై ఆధారపడి ఆర్థికంగా అప్పులు తీసుకొచ్చి ఖర్చు పెట్టి కష్టపడి వరి, పత్తి, మొక్కజొన్న పంటలను సాగుచేస్తున్నాము. పంటలు చేతికొచ్చే దశలో అడవి పందులు పంటల్లోకి చొరబడి పంటను తినేస్తూ మొక్కలను విరగొట్టడంతో సాగు దిగుబడి నష్టంతో పాటు ఆర్థిక నష్టాన్ని ఎదుర్కోవాల్సి వస్తుందని రైతులు వేదన చెందుతున్నారు. ఈ సమస్యపై రైతులు పారెస్ట్ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ సరైన చర్యలు తీసుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. తక్షణమే అడవి పందుల కదలికలను నియంత్రించేందుకు ఫారెస్ట్ అధికారులు వలలు, పంజరాలు వేసి వాటిని పట్టుకోవడం సమస్య అధికంగా ఉన్న ప్రాంతాల్లో గస్తీ బృందాలను ఏర్పాటు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు. పారెస్ట్ శాఖ అధికారులు గ్రామాల సందర్శన చేసి పంట నష్టానికి పరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తు అడవి జంతువుల కారణంగా జరిగే పంట నష్టాలను కూడా పంట భీమా పరిధిలోకి తీసుకు రావాలని లేదంటే రైతుల కష్టం వృధా అవుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా కార్యదర్శులు చర్యలు చేపట్టాలి

జైపూర్, అక్టోబర్ 14, ప్రభాతవార్త

మండల పంచాయతీ అధికారి శ్రీపతి బాపు రావు మంగళవారం మిట్టపల్లి గ్రామంలో ఈ.జి.ఎస్ గ్రామ సభలో పాల్గొని మొబైల్ యాప్ ఇన్‌స్పెక్షన్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామంలో నిర్వహిస్తున్న పారిశుధ్య కార్యక్రమాలను పరిశీలించి తడి చెత్త, పొడి చెత్త వేరువేరుగా సేకరించాలన్నారు. గ్రామంలో ప్లాస్టిక్ కవర్లు ఇతర వ్యర్థాలు లేకుండా చూసుకోవాన్నారు. రహదారులు, మురుగు కాల్వలు పరిశుభ్రంగా ఉంచాలని, గ్రామ పంచాయతీ రికార్డులను ఎప్పటికప్పుడు అప్‌పేట్ చేయాలని తెలియజేశారు. సెగ్రిగేషన్ షెడ్‌లో కంపోస్టు ఎరువు తయారు చేయాలని, వాటర్ అండ్ శానిటేషన్‌కు సంభందించిన 7 రిజిష్టర్లను పరిశీలించారు. అనంతరం వాటర్ ట్యాంకు చుట్టూ శుభ్రం చేయాలని పంచాయతీ కార్యదర్శికి సూచించారు.

## వివాహిత ఆత్మహత్య

త్యిర్యాని, అక్టోబర్, ప్రభాతవార్త

కుటుంబ కలహాలతో సైదం కల్పన (28) అనే వివాహిత పురుగుల మందు సేవించి ఆత్మహత్య చేసుకున్న సంఘటన తిర్యాని మండలంలో చోటుచేసుకుంది. తిర్యాణి ఎస్సై వెంకటేష్ తెలిపిన వివరాలు ప్రకారం తిర్యాని మండలం గంభీరావుపేట గ్రామానికి చెందిన సైదం శేఖర్ కు తనకు వరుసకు మేనమామ అయిన బెల్లంపల్లికి మండలం కన్నల గ్రామానికి చెందిన జాగిర్తి బాపు రెండవ కూతురు కల్పనతో 12 సంవత్సరాల క్రితం వివాహం జరగగా గత కొన్ని సంవత్సరాలుగా సాఫీగా సాగిన దాంపత్య జీవితంలో గత రెండు సంవత్సరాల నుండి గొడవలు మొదలయ్యాయని తెలిపారు. అంతకు ముందు తిర్యాని పోలీస్ స్టేషన్లో శేఖర్ ఫిర్యాదు ఇవ్వగా భార్య భర్తలకి ఇద్దరికీ కౌన్సిలింగ్ చేసి పంపించడం జరిగిందని తెలిపారు. అనంతరం మళ్లీ గొడవ కావడంతో కల్పన పుట్టింటికి వెళ్లిపోవడంతో అనేక సార్లు పెద్దమనుషుల సమక్షంలో అలాగే కోర్టులో పంచాయతీలు జరిగాయని పేర్కొన్నారు. ఈ క్రమంలో సోమవారం రాత్రి కల్పన పురుగుల మందు సేవించి అపస్మారక స్థితికి చేరుకోవడంతో కుటుంబ సభ్యులు గమనించి హుటాహుటిన తిర్యాని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ కల్పన మృతి చెందినట్లు ఎస్సై వెంకటేష్ తెలిపారు. కల్పన తల్లి జాగిర్తి దేవక్క ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. కల్పన శేఖర్ దంపతులకు కొడుకు హర్షవర్ధన్(8)కూతురు సామాన్విత (6)లు ఉన్నారు. కాగా అల్లుడే తమ కూతురు కల్పనను హతమార్చడాని తల్లిదండ్రులు ఆరోపించారు.

## మైనర్ బాలికపై అత్యాచారం

బజార్‌హత్నూర్, అక్టోబర్ 14, ప్రభాతవార్త

మండల కేంద్రంలోని ఓ బాలిక పై వృద్ధుడు తన పైశకత్వాన్ని ప్రదర్శించాడు. బోథ్ సీఐ, బజార్ హత్నూర్ ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం నేరడిగొండ మండలానికి చెందిన చందనగిరి కిష్టయ్య అనే వ్యక్తి తొమ్మిది సంవత్సరాల మైనర్ బాలికపై అత్యాచారానికి పాల్పడినట్లు తెలిపారు. నిందితుడిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి



## పాఠశాలలలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలి

**- ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు వసాకె సాయికుమార్**

కాగజ్‌నగర్, అక్టోబర్ 14, ప్రభాతవార్త

జిల్లాలోని పాఠశాలలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు వసాకె సాయికుమార్ కోరారు. మంగళవారం భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ కుమురం భీం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కాగజ్‌నగర్ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల (ఓల్డ్) లో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు వసాకె సాయికుమార్ మాట్లాడుతూ జిల్లాలో ఉన్న విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఎస్ఎఫ్ఐ సంఘంలో సభ్యులుగా చేరాలని పిలుపునిచ్చారు. జిల్లా వ్యాప్తంగా విద్యా రంగంలో అనేక సమస్యలు ఉన్నాయని, ఆ సమస్యలను పరిష్కరించాలని కోరారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల(ఓల్డ్) లో త్రాగునీటి సమస్య, తరగతి గదులు సరిపడా లేవని, డైనింగ్ హాల్లో విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్నారని, మూత్రశాలలు, మరుగుదొడ్లు సరిగ్గా లేవని విద్యార్థులు తమ దృష్టికి తీసుకొచ్చారని అన్నారు. వెంటనే పై సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యుడు దీపక్, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

## కేటీఆర్‌ను కలిసిన మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప

కాగజ్‌నగర్, అక్టోబర్ 14, ప్రభాతవార్త



బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను మంగళవారం హైదరాబాద్ నందినగర్‌లో సిర్పూర్ మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సిర్పూర్ నియోజకవర్గంలోని రాజకీయ పరిస్థితులపై, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల గురించి కేటీఆర్‌తో చర్చించారు.

## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలి

**- కాగజ్‌నగర్ ఎంపిడిఓ వాసుదేవ్**

కాగజ్‌నగర్ రూరల్, అక్టోబర్ 14, ప్రభాతవార్త

కాగజ్‌నగర్ మండలంలోని ఎన్‌జీవోస్ గ్రామపంచాయతీలో పరిధిలో లబ్ధిదారులకు మంజూరైన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తిచేయాలని కాగజ్‌నగర్ ఎంపిడీఓ వాసుదేవ్ అన్నారు. మంగళవారం ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల పురోగతిని ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించి లబ్ధిదారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల్లో ఏమైనా ఇబ్బందులు ఉంటే గ్రామ పంచాయతీ కార్యదర్శి దృష్టికి తీసుకుపోవాలని లబ్ధిదారులకు సూచించారు. నిర్మాణాల్లో ఉన్న ఇండ్లను లబ్ధిదారులతో త్వరితగతిన పని పూర్తి చేసుకోవాలని, ఇండ్ల నిర్మాణాల దశలను బట్టి ప్రభుత్వం బిల్లులు మంజూరు చేసి నిధులను లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తుందన్నారు. క్షేత్ర సందర్శనలో ఎంపిడిఓ వెంట ఈజిఎస్ ఏపీవో చంద్రశేఖర్, గ్రామ పంచాయతీ కార్యదర్శి సునీల్ ఉన్నారు.



## ఆర్థిక సహాయం అందజేత

కాగజ్‌నగర్ , అక్టోబర్ 14, ప్రభాతవార్త :



కాగజ్‌నగర్ పట్టణంలోని వార్డు నెం.18కి చెందిన బీఆర్ఎస్ పార్టీ మహిళా నాయకురాలు దమయంతికి మంగళవారం బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీఆర్ఎస్ నాయకురాలు దమయంతి తల్లి ఇటీవల మృతిచెందగా బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆదేశాల మేరకు వారి ఇంటికి వెళ్లి ఆర్థిక సహాయంగా బియ్యం అందజేసినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ నక్క మనోమర్, బీఆర్ఎస్ పార్టీ పట్టణ మహిళ కన్వీనర్ తాండ్ర వరలక్ష్మి, పట్టణ కార్యదర్శి మారపాక శోభన్, మహిళా కార్యదర్శి పెరుక లావణ్య, తదితరులు పాల్గొన్నారు.



## ఎంబీబీఎస్ సీటు సాధించిన విద్యార్థికి సన్మానం

**కాగజ్‌నగర్, అక్టోబర్ 14,ప్రభాతవార్త**

కాగజ్‌నగర్ మండలంలోని కోయవాగు చింతగూడ గ్రామానికి చెందిన అష్రఫ్ బేగ్ ఎంబీబీఎస్ సీటు సాధించిన సందర్భంగా మంగళవారం విద్యార్థిని గ్రామస్థులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోయవాగు చింతగూడ గ్రామానికి చెందిన స్వర్గీయ మునవర్ బేగ్ కుమారుడు అష్రఫ్ బేగ్ నీట్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించి మంచిర్యాలలో ఎంబీబీఎస్ సీటు సాధించగా సిర్పూర్ మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ఆదేశాల మేరకు శాలువాతో ఘనంగా సత్కరించి స్వీట్లు తినిపించి అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# సీఎంఆర్ లక్ష్యాలను త్వరగా పూర్తి చేయాలి

### - మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**నస్పూర్, అక్టోబర్ 14, ప్రభాతవార్త**

జిల్లాలోని రైస్ మిల్లులకు కేటాయించిన సీఎంఆర్ లక్ష్యాలను త్వరగా పూర్తి చేయాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి. చంద్రయ్య, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి బ్రహ్మారావు, జిల్లా మేనేజర్ శ్రీకళలతో కలిసి రైస్ మిల్లర్ల సంఘం ప్రతినిధులు, రైస్ మిల్లర్లతో లక్ష్య సాధనపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని రైస్ మిల్లులకు కేటాయించిన సీఎంఆర్ లక్ష్యాలను త్వరగా పూర్తిచేసే విధంగా ఆయా రైస్ మిల్లర్ల నిర్వాహకులు కృషి చేయాలని, సంబంధిత శాఖల అధికారులు రైస్ మిల్లర్లను సమన్వయం చేసుకుంటూ లక్ష్యాలను పూర్తి చేసే విధంగా పర్యవేక్షించాలని తెలిపారు. ప్రభుత్వం ఖరీఫ్ 2025-26 సంవత్సరానికి సంబంధించిన వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ చేపట్టేందుకు సన్నాహాలు చేస్తుందని, ఈ నేపథ్యంలో రైస్ మిల్లులలో సీఎంఆర్ లక్ష్యాలను పూర్తి చేయాలని తెలిపారు. బ్యాంకు గ్యారంటీ, డిఫాల్టర్‌గా ఉన్న రైస్ మిల్లులకు ధాన్యం కేటాయించడం జరగదని తెలిపారు. అనంతరం రైస్ మిల్లుల వారీగా పెండింగ్ ఉన్న సీఎంఆర్ లక్ష్యాల వివరాలను సమీక్షించి త్వరగా పూర్తి చేసే విధంగా కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన

**కాగజ్‌నగర్ రూరల్ ,అక్టోబర్ 14, ప్రభాతవార్త**

కాగజ్ నగర్ పట్టణంలోని ప్రజాలైఫ్ కేర్ ఆసుపత్రిలో ప్రజాబంధు ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన వచ్చినట్లు సిర్పూర్ శాసనసభ్యులు,ఫౌండేషన్ అధ్యక్షులు డా.పాల్వాయి హరీష్ బాబు తెలిపారు. ఉచిత కంటి వైద్య శిబిరంలో 42 మందికి పరీక్షలు నిర్వహించగా అందులో 21 మందికి ఆపరేషన్ అవసరమని వారికి విడతల వారిగా ఆపరేషన్ నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. అలాగే ప్రతి మంగళవారం కంటి పరీక్షలు నిర్వహించబడునని, కంటి శుక్లాలు ఉన్నవారు, కంటి చూపు మందగించిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోగలరని వారు కోరారు.

# హుండీ డబ్బులు తిరిగి అడెల్లి పోచమ్మ ఆలయ నిధికి జమ చేయాలి

**సారంగాపూర్, అక్టోబర్ 14, ప్రభాతవార్త**




మండలంలోని అడెల్లి పోచమ్మ ఆలయ పునర్నిర్మాణం పేరిట కాంట్రాక్టర్‌కి అప్పజెప్పిన ఆలయ డబ్బులు తిరిగి, కాంట్రాక్టర్‌తో అడెల్లి మహా పోచమ్మ అమ్మవారి ఆలయ నిదికి అప్పజెప్పాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కరిపే విలాస్ మండల కేంద్రంలో నిర్వహించిన మీడియా సమావేశంలో అన్నారు. గత ప్రభుత్వంలో అడెల్లి మహా పోచమ్మ ఆలయానికి 6 కోట్ల 60 లక్షలు నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు. అమ్మవారి ఆలయానికి భక్తులు సమర్పించిన కానుకలు, హుండీ డబ్బుల నుండి 1 కోటి 58 లక్షలు కాంట్రాక్టర్‌కు ఇవ్వడం జరిగింది. దీని వెనుక ఎవరి ప్రమేయం ఉందని ప్రశ్నిస్తూ, తిరిగి ఆ డబ్బులను అమ్మవారి హుండీకి జమ చేయాలని, ఇతర జిల్లాల, రాష్ట్రాల నుండి వచ్చే భక్తులకు ఆలయ ఆవరణలో కనీస సౌకర్యాలు మహిళ భక్తులకు టాయిలెట్స్ లేవు. 2 సంవత్సరాల నుండి మూల విరాట్ గెస్ట్ రూమ్‌లో ఉంది. గుడి నిర్మాణం పూర్తి అయిన మూల విరాట్ ప్రతిష్టపన ఎందుకు చేస్తలేరు చెప్పాలని డిమాండ్ చేశారు. లేని యెడల భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో నిరాహార దీక్షలు, ఉద్యమాలు చేపడుతామని బీజేపీ నాయకులు హెచ్చరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు నరేష్, మండల సీనియర్ నాయకులు సాహెబ్ రావ్, సామల వీరయ్య, చెన్న రాజేశ్వర్, నర్సయ్య, మండల ఉపాధ్యక్షులు తిరుమల చారి, మండల నాయకులు ప్రకాష్, శేఖర్ గౌడ్, కేవ్లా నాయక్, భీమ లింగం, రామారావు, సురేష్, దేవన్న, శేఖర్ యాదవ్, రవి తదితరులు పాల్గొన్నారు.

## రామారావు పేట గ్రామాన్ని సందర్శించిన జిల్లా పంచాయతీ అధికారి

**జైపూర్, అక్టోబర్ 14, ప్రభాతవార్త**

జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్ రావు మంగళవారం జైపూర్ మండలంలోని రామారావుపేట గ్రామాన్ని మండల పంచాయతీ అధికారి బాపు రావుతో కలిసి ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తడి చెత్త, పొడి చెత్త ఎప్పటికప్పుడు సేకరించాలని సెగ్రిగేషన్ చేసి డ్రైవేస్ట్‌ను రీసైకిల్‌కి పంపించాలన్నారు. ఇంటి పన్ను వంద శాతం వసూలు చేయాలని, ట్రేడ్ లైసెన్స్‌కి ఎప్పటికప్పుడు రెన్యూవల్ చేయించాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. సెగ్రిగేషన్ షెడ్‌ని సందర్శించి కంపార్ట్మెంట్‌లలో ప్లాస్టిక్‌ను సేకరించి వాటిని అమ్మి గ్రామ పంచాయతీకి జమ చేయాలన్నారు. గ్రామ పంచాయతీలోని అన్ని రికార్డులను ఎప్పటికప్పుడు అప్‌పేట్ చెయ్యాలని, వాటర్ ట్యాంక్ నుండి వదిలే నీటిని ప్రతి రోజు క్లోరినేషన్ చేయాలన్నారు. గ్రామ పంచాయతీలోని ప్రభుత్వ భూమిలో ఉన్న ఇండ్లకి సంబంధించిన వివరాలను రెవెన్యూ అధికారులకు ఇవ్వాలన్నారు.





## కొమురం భీం ఆశయ సాధనకు
# ప్రతీ ఒక్కరు కృషిచేయాలి

### - బిఆర్ఎస్ సిర్పూర్ నియోజకవర్గ కన్వీనర్ లెండుగురే శ్యామ్‌రావు

**కాగజ్‌నగర్ రూరల్, అక్టోబర్ 14,ప్రభాతవార్త**

కొమురం భీం ఆశయ సాధనకు ప్రతీ ఒక్కరు కృషిచేయాలని బిఆర్ఎస్ సిర్పూర్ నియోజకవర్గ కన్వీనర్ లెండుగురే శ్యామ్‌రావు పిలుపునిచ్చారు.

కొమురం భీం 85వ వర్ధంతి పురస్కరించుకుని కాగజ్‌నగర్ మండలం కోసిని గ్రామంలోని పాణహిత భవన్ ఆవరణలో జెండా పండుగ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా లెండుగురె శ్యామ్‌రావు పాల్గొన్నారు. కొమురం భీం విగ్రహానికి పూలమాల వేసి జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొమురం భీం త్యాగాలు, పోరాటం తెలంగాణ ప్రజలకు స్ఫూర్తిగా నిలిచాయని, ఆయన ఆత్మస్ఫూర్తితో ప్రజల అభ్యున్నతి కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమానికి హాజరైన వారికి బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ ఆదేశాల మేరకు అన్నదాన కార్యక్రమం నిర్వహించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు నక్క మనోహర్ ,బండి వాసు, తన్నీరు పోచం,డౌత్రే గోపాల్, కామ్రే విజయ్,రావుజి, కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణి భూముల్లో దొంగ పట్టాల దందా

### - అధికారులు మౌనంగా ఉండటం గందరగోళానికి కారణం

**రామకృష్ణాపూర్, అక్టోబర్ 14, ప్రభాతవార్త**

మందమరి ఏరియా రామకృష్ణాపూర్ సింగరేణి భూములపై దొంగ పట్టాల దందా విస్తృతంగా జరుగుతుండడం స్థానికులను ఆందోళనకు గురి చేస్తుంది. నాన్ సరెండర్ ఏరియాలో నిర్మించిన ఇళ్లకు డబ్బులు తీసుకుని పట్టాలు ఇస్తున్న వ్యవహారం బాగా చెలరేగింది. ఈ వ్యవహారం జీవో 76తో సంబంధం లేని అంశాల్లో జరుగుతున్నది. విశ్వసనీయ సమాచారం ప్రకారం, పట్టణంలో ఒక ఎల్ఐసీ ఉద్యోగి ఈ అక్రమ దందాలో కీలక పాత్ర పోషిస్తున్నాడు. అదేవిధంగా, అతను రెవెన్యూ ఆఫీసులో బ్రోకర్‌గా విధులు నిర్వర్తిస్తూ, భూముల అక్రమ రిజిస్ట్రేషన్‌లో పాల్పడుతున్నట్టు సమాచారం. సింగరేణి భూములను మాయమాటలతో ఇతరుల పేర్లపై రిజిస్ట్రేషన్ చేయించుకుని, ప్రజలను మోసం చేయడం సాధారణమవు తోంది. గత ప్రభుత్వం జీవో 76 ద్వారా కొంతమందికి ఇళ్ల పట్టాలు ఇచ్చింది, అయితే మిగిలిన భూభాగాలను సరెండర్ చేయించాల్సి ఉండగా, కొందరు దళారులు అక్రమంగా పట్టాలు తీసుకుని దందా కొనసాగిస్తున్నారు. పట్టణ ప్రజలు సింగరేణి యాజమాన్యాన్ని గట్టి చర్యలు తీసుకొని, ఈ అక్రమాలను తక్షణమే ఆపాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రతికూల పరిణామాలను నివారించడానికి, సింగరేణి అధికారులు వెంటనే పునర్ విచారణ ప్రారంభించి, దొంగ పట్టాలను రద్దు చేయడం, భవిష్యత్తులో ఇలాంటి దందాలకు అడ్డుకట్ట వేయడం అత్యవసరం అని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

## చిట్టీల పేరుతో మోసం

**బజార్‌హత్నూర్, అక్టోబర్ 14, ప్రభాతవార్త**




మండల కేంద్రానికి చెందిన ఒక వ్యక్తి చిట్టీల పేరుతో మోసానికి పాల్పడ్డాడు. బోథ్ సీఐ, బజార్‌హత్నూర్ ఎస్ఐ తెలిపిన కథనం ప్రకారం ఎడ్ల రాజు అనే వ్యక్తి బాధితుల వద్ద దాదాపు 15 లక్షల రూపాయల వరకు చిట్టీ కట్టించుకొని తిరిగి మళ్ళీ డబ్బులు చెల్లించకుండా మోసం చేశాడని, నిందితుడిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని తెలిపారు.



## ఆదివాసి గూడెల్లో ప్రారంభమైన గుస్సాడీ దండారి వేడుకలు

సిరికొండ, అక్టోబర్ 14, ప్రభాతవార్త

సిరికొండ ఆదివాసీల గుస్సాడి, దండారి భోగి వేడుకలు దీపావళి పండుగకు వారం ముందేగానే ఈ వేడుకలు మొదలయ్యాయి. సిరికొండ మండలంలోని రిమ్మ గ్రామంలో ఆదివాసీలు సంస్కృతి సాంప్రదాయాలతోబోగి ఎతమ్మ దేవతకు పూజలు నిర్వహించారు. దీంతో గుస్సాడీ దండారి సంబరాలు ప్రారంభమయ్యాయి. ఈ పండుగలో దండారీ నృత్య బృందాలు రంగురంగుల దుస్తులు ధరించి, నెమలి ఈకలు, జింక కొమ్ములు, మేక చర్మం వంటి వస్తువులతో అలంకరించుకుని, సమీపంలోని గ్రామాలను సందర్శించి నృత్యాలు, పాటలతో అలరిస్తారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, సిడం శంకర్ పటేల్ పెందుర్ ప్రహ్లాద్, మురుసుకోల్ల అమృత్ రావ్, సీడాం సీతారాం. సిడాం దేవ్ రావ్, పెందూర్ రాములు, సిడాం లాల్ సాబ్, పెందూర్ అనిల్ కుమార్ పాల్గొన్నారు.

## తల్లులకు, గర్భిణిస్త్రీలకు పోషకాహారంపై అవగాహన కార్యక్రమం

జన్నారం, అక్టోబర్ 14, ప్రభాతవార్త



తల్లులకు, గర్భిణీస్త్రీలకు అంగన్వాడీ అధికారులు పోషకాహా రంపై అవగాహన కల్పించారు. రాష్ట్రీయ పోషమాసంలో భాగంగా మంగళవారం రోజున జన్నా రం మండలకేంద్రంలోని అటవీశాఖ టిడిసి హాల్లోజన్నారం, దండేపల్లి మండలాలకు చెందిన తల్లులకు, గర్భిణిస్త్రీలకు అంగన్వాడీ అధికారులు పోష కాహారంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫుడ్ స్టాల్ ఏర్పాటు చేసి వాటి ములంగా కలిగే ప్రయోజనాలను వారికి వివరించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాల ద్వారా తల్లులకు, గర్భిణి స్త్రీలకు, కిషోర బాలికలకు, చిన్నారులకు అందించేపోషకాహారం క్రమం తప్పకుండా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిడబ్ల్యుఓ రవుఫ్ ఖాన్, సిడిపిఓ రేష్మ, ఏసిడిపిఓ ప్రియదర్శిని, మార్కెట్ కమిటీ చైర్మన్ దుర్గం లక్ష్మీనారాయణ, సూపర్వైజర్లు పద్మ, దీపావహిని, కవిత దండేపల్లి సూపర్వైజర్లు రమాదేవి, వెంకటలక్ష్మి, పోషక అభియాన్ లక్ష్మీ, లిప్సిక, విజయ తదితరులు పాల్గొ న్నారు.

## సత్య సాయి సేవా సమితి ఆధ్వర్యంలో పాఠశాలకు భోజనం ప్లేట్లు అందజేత

లక్షెట్టిపేట, అక్టోబర్ 14, ప్రభాతవార్త

పట్టణంలోని జడ్పీహెచ్ఎస్ బాయ్స్ పాఠశాలలో సత్యసాయి సేవా సమితి లక్షెట్టిపేట మహిళా విభాగం తరుపున అభివృద్ధిలో భాగంగా పాఠశాల మౌలిక అవసరాల నిమిత్తం విద్యార్థులకు 60 భోజన ప్లేట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సునంద మాట్లాడుతూ... సత్యసాయి సేవా సమితి లక్షెట్టిపేట వారు ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తూ అందరికి ఆదర్శంగా నిలుస్తున్నారని కొనియడుతూ వారికి పాఠశాల తరుపున ధన్యవాదాలు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో మహిళా విభాగం కార్యకర్తలు, ప్రధానోపాధ్యాయి సునంద, ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.




# అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించే వారిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలి

**- ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీ కాంతిలాల్ పాటిల్**

ఆసిఫాబాద్, అక్టోబర్ 14, ప్రభాతవార్త

అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించే వారిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీ కాంతిలాల్ పాటిల్ పోలీస్ అధికారులకు సూచించారు. మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నెలవారీ నేర సమీక్షా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రతీ కేసులో క్వాలిటీ ఆఫ్ ఇన్వెస్టిగేషన్ ద్వారా నేరస్తులకు శిక్షపడే విధంగా చేసి బాధితులకు న్యాయం చేకూర్చాలని సూచించారు. కేసుల విచారణలో జాప్యం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. పోలీస్ అధికారులంతా బాధ్యతగా వ్యవహరించాలని, పెట్రోలింగ్, బ్లూ కోల్ట్స్ వాహనాలతో అధికారులు, సిబ్బంది నిరంతరం గస్తీ కాస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. సస్పెక్ట్ షీట్, రౌడీషీట్‌లలో నమోదైన వ్యక్తుల పై ప్రత్యేక నిఘా ఉంచాలని, గంజాయి వంటి మత్తు పదార్థాలు,మట్కా, జూదం లాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు.



వ్యవసాయ, పంట భూముల్లో గంజాయి సాగు నిర్మూలన కోసం పోలీస్ సెర్చ్ టీమ్స్ ప్రత్యేకంగా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. జిల్లాలోని ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలోని ముఖ్యమైన అన్ని ప్రదేశాలలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకునే విధంగా చర్యలు చేపట్టాలని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా సైబర్ నేరాల్లో నగదును కోల్పోయిన భాధితులు వెంటనే స్పందించి ఫిర్యాదు చేసినప్పుడు తక్షణమే వారికి అండగా ఉండాలని సూచించారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో నాకాబంది, కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్స్ నిర్వహించాలని అన్నారు. దీపావళి పండుగ నేపథ్యంలో బాణాసంచా దుకాణాలు ఏర్పాటు చేసే ప్రాంతాల్లో పర్యవేక్షణ నిర్వహించి అగ్ని ప్రమాదాలలాంటి సంఘటనలు జరగకుండా చూడాలని తెలిపారు. ఈ సమావేశంలో ఆసిఫాబాద్ ఏఎస్పీ చిత్తరంజన్, కాగజ్‌నగర్ డిఎస్పీ వాహిదుద్దీన్, జిల్లాలోని సిఐలు, ఆర్ఐలు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.



# మీ స్వరం - మీ దార్శనికత - మా భవిష్యత్తు

**- రాష్ట్ర సమాచార పౌర సంబంధాల కమిషనర్ ప్రియాంక**

ఆసిఫాబాద్, అక్టోబర్ 14, ప్రభాతవార్త

తెలంగాణ రైసింగ్ విజన్ 2047లో భాగంగా మీ స్వరం - మీ దార్శనికత - మా భవిష్యత్తు నినాదంతో రాష్ట్ర పౌరులు పురోగతిని ఊహించుకునే అంశాన్ని ప్రభుత్వంతో పంచుకోవాలని రాష్ట్ర సమాచార పౌర సంబంధాల కమిషనర్ ప్రియాంక ఒక ప్రకటనలో తెలిపారు. 2047 నాటికి భారతదేశం 100 సంవత్సరాల స్వాతంత్రం జరుపుకునే నాటికి రాష్ట్ర ముఖ్యమంత్రి ఆకాంక్షలకు అనుగుణంగా రాష్ట్ర అభివృద్ధి, రూపొందించే దీర్ఘకాలిక రోడ్డు మ్యాప్ తెలంగాణ రైసింగ్ విజన్ 2047 అంశాలతో డాక్యుమెంటరీ తయారీలో భాగస్వామ్యం పొందేలా సిటిజన్ సర్వే చేపట్టడం జరిగిందని తెలిపారు. ఈ నెల 10వ తేదీన ప్రారంభమైన ఈ సర్వేలో రాష్ట్ర ప్రజలు, ఎన్.ఆర్.ఐ.లు పెద్ద ఎత్తున పాల్గొంటున్నారని, రాష్ట్రంలోని ప్రతి ఉద్యోగి ఈ సర్వేలో పాల్గొని తమ విలువైన సలహాలు, సూచనలు అందించాలని తెలిపారు. ఈ నెల 25వ తేదీ వరకు జరిగే విజన్ 2047 సర్వేలో ఉద్యోగులందరూ పాల్గొనడంతో పాటు ఈ సర్వే లింక్ https://www.telangana.gov.in/telanganarising/, క్యూఆర్ కోడ్‌లను తమ కార్యాలయాలలో ప్రదర్శించడంతో పాటు విస్తృత ప్రచారం నిర్వహించాలని తెలిపారు. రానున్న రోజులలో రాష్ట్రాన్ని అభివృద్ధి, సంక్షేమ రంగాలలో అగ్రగామిగా నిలబెట్టేందుకు ప్రభుత్వం రూపొందిస్తున్న తెలంగాణ రైజింగ్ విజన్ 2047 డాక్యుమెంటరీని రూపొందించడంలో ప్రతి రాష్ట్ర పౌరుడు భాగస్వామ్యమై సిటిజన్ సర్వేలో పాల్గొని తమ ఆలోచనలను పంచుకోవాలని తెలిపారు.

# అక్రమ ఇసుక రవాణాపై కట్టుదిట్టమైన చర్యలు

**- టిజిఎండిసి మంచిర్యాల, భూపాలపల్లి జిల్లాల ప్రాజెక్టు అధికారి పి.రామకృష్ణ**

నస్పూర్, అక్టోబర్ 14, ప్రభాతవార్త

జిల్లాలో ఇసుక అక్రమ రవాణా జరగకుండా సంబంధిత శాఖల సమన్వయంతో కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని టి.జి.ఎం.డి.సి. మంచిర్యాల, భూపాలపల్లి జిల్లాల ప్రాజెక్టు అధికారి పి.రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఇసుక మాఫియా కొనసాగుతుందని, అధికారులు నిరక్ష్య వైఖరితో వ్యవహరిస్తున్నారని సామాజిక మాధ్యమాలలో వస్తున్న అవాస్తవ కథనాలలో ఎలాంటి నిజం లేదని తెలిపారు. జిల్లా అధికార యంత్రాంగం సమన్వయంతో ఇసుక అక్రమ రవాణా జరగకుండా విస్తృత తనిఖీలు చేపట్టడంతో పాటు సరిహద్దుల వద్ద ప్రత్యేక నిఘా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. వ్యక్తిగత ప్రయోజనాల కోసం సామాజిక మాధ్యమాలలో తప్పుడు ప్రచారం చేస్తున్న వారిపై తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ఇసుక రవాణా పారదర్శకంగా లబ్ధిదారులకు అందుతుందని, ఈ విషయంలో ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుందని తెలిపారు. అసంబద్ధమైన, అవాస్తవ ప్రచారాలను ప్రజలు నమ్మవద్దని తెలిపారు.

# రెవెన్యూ సదస్సుల దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

**- ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే**

ఆసిఫాబాద్, అక్టోబర్ 14, ప్రభాతవార్త

భూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం నిర్వహించిన భూ భారతి రెవెన్యూ సదస్సులలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా అదనపు కలెక్టర్ డేవిడ్, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా, ఆసిఫాబాద్ రాజసవ మండల అధికారి లోకేశ్వర్ రావులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లాలోని అన్ని మండలాల తహసిల్దార్లతో రెవెన్యూ అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన అనేక అభివృద్ధి పనులు, నీటిపారుదల శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రాజెక్టులు, చెరువులు, కాలువలు, రహదారులు, జాతీయ రహదారుల నిర్మాణాలలో ముంపుకు గురైన భూముల వివరాలు, ప్రభుత్వ భూములు, దేవాదాయ, వక్ఫ్, సీలింగ్ భూములు, నిషేధిత జాబితాలోని భూముల వివరాలతో స్పష్టమైన నివేదికను సమర్పించాలని తెలిపారు. భూభారతి రెవెన్యూ సదస్సులలో వచ్చిన ప్రతి దరఖాస్తును పాత రెవెన్యూ రికార్డులతో సరిచూసి క్షేత్రస్థాయిలో పరిశీలించి సంబంధిత వారసులకు, దరఖాస్తుదారులకు నోటీసులు అందజేయాలని సూచించారు. సాదా బైనామా ప్రక్రియలో దరఖాస్తులకు సంబంధించిన యజమానులకు నోటీసులు అందించి చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అన్ని మండలాల తహసిల్దార్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.